# సింగిరెడ్డి నారాయణ రెడ్డి తో



**మధుర:** మిమ్మల్నీ దాశరథినీ ఉద్దేశించి చలంగారు ఎవరీ శ్రావణ భాద్రపదాలు అన్నారు

**సినారె:** అవధానాలు చెయ్యకపోయినా మేం జంట కవుల సంప్రదాయాన్ని పాటించాం నాకు చలం గారితో పరిచయమయితే లేదు

**మధుర:** హైదరాబాద్ వచ్చే యాత్రికులు చూడవలసిన వాటిల్లో ''నారాయణ రెడ్డి'' కూడా ఒక ఎజెండా ఐటమ్ అని అనుకోడం విన్నాను వండర్స్ ఆఫ్ ది హైదరాబాద్‌లో మీరు

**సినారె:** అదీ ఓ కాంప్లిమెంటే-

**మధుర:** శివుళ్లా మీరు భక్తజన సులభులని విన్నాను అందరికీ ఆశ్రయమిస్తారనీ అందరికీ అందుబాట్లో వుంటారనీ తెలిసింది

**సినారె:** నేను సామాన్యుల్లో సామాన్యుడిగా మాన్యుల్లో మాన్యుడినిగా వుంటా అదినాకు చాలా ఇష్టం

**మధుర:** మీరు చాలా అందమైన వారు

**సినారె:** (నవ్వు) నా అందాన్ని నేను మెచ్చుకోటం బాగుండదు నా అందాన్ని కన్నా నా కవిత్వాన్ని ఎవరైనా మెచ్చుకుంటే సంతోషిస్తా

**మధుర:** మీరు ఆస్తికులా, నాస్తికులా?

**సినారె:** నేను మూఢనమ్మకాలకూ మూఢాచారాలకూ వ్యతిరేకిని

**మధుర:** కవుల్లో మీరూ శేషేంద్ర శర్మగారూ అందగాళ్లని ఒప్పుగుంటారా లేదా, చెప్పండి

**సినారె:** ఒప్పుకోకపోతే డేంజరు

**మధుర:** గిరీశంగారు డాబులరాయుడేగాని మందు పుచ్చుకోరు

**సినారె:** నేను డాబులరాయుణ్ణి కాను, మందు పుచ్చుగుంటాను

**మధుర:** అన్ని ప్రభుత్వాలతోనూ మంచిగా వుంటూ అందరికీ యిష్టంగా నడుచుకోవడం కష్టంగాదూ?

**సినారె:** మంచివాళ్లతో మంచిగానూ చెడ్డవాళ్లకి దూరంగానూ ఉండమని కదా, మీ అమ్మనీకు చెప్పింది? నేను చెడ్డవాళ్లతో కూడా మంచిగా వుంటాను

**మధుర:** మీరు కొంత నా పోలికే

**సివారె:** నీతో స్నేహంగా ఉండమంటే వుంటా; దయచేసి పోలికలు తేవద్దు.

**మధుర:** మీరు సైతం సానులకి భయపడుతున్నారే! సానులు మాత్రం మనుషులు కారా; వారికి మనసుండదా!?

**సివారె:** నువ్వు సౌజన్యారావు పంతుల్నే బురిడీ కొట్టించావు....నే ననగా యెంత?

**మధుర:** మీ దగ్గిర చదువుకొనుంటే నేను మంచి పండితురాలినయ్యేదాన్ని, అప్పుడు నన్నందరూ డ్యాక్టర్ మధురవాణి అనుండేవారు...ప్చ్!

**సివారె:** ఆర్నెల్లు సావాసం చేస్తే వారు వీరవుతారు. నువ్వు డ్యాక్టరువి అయినా కాకపోయినా గురజాడ వారి ముద్దుల బిడ్డవు; ఆయన బ్రెయిన్ చైల్డువి

**మధుర:** మీ దగ్గర చదువుకున్న వారు అహ్హో, ఒహ్హో-అంటారట. ఎమ్వీయల్ మిమ్మల్ని తెగ మెచ్చుకునేవాడు.

**సివారె:** చదువు చెప్పడం నా వృత్తి కవిత్వం నా ఊపిరి

**మధుర:** వాణి నా రాణి-అని మీ శ్లేదు గానీ అంటే మాత్రం మిమ్మల్ని కాదనేవారెవరంట!

**సివారె:** కవిత్వం రాయని రోజు నాకు దుర్దినంలా వుంటుంది.

**మధుర:** పూర్వం 'పొద్దునియమం' ఉన్నవాళ్లు సూర్యుడు కనపడనిరోజు భోజనమే చేసేవారు కాదు

**సివారె:** ''కవిత గలిగిన రాజ్యాధి కారమేల?''

**మధుర:** మంచి కొటేషను .. మీటింగులూ సన్మానాలూ పూలదండలూ లేకపోతే మీకు తోచదట. ఎవరు పిలిచినా వక్తగానో అధ్యక్షుడుగానో ముఖ్యఅతిథిగానో వెళిపోతారుట; ఆఖరికి స్వీట్స్‌షాపు ప్రారంభోత్సవానికయినా సరేట-

**సివారె:** నా కన్నివర్గాల్లోనూ మిత్రులున్నారు నువ్వే అన్నావుగా, నన్ను శివుడితో పోల్చి; భక్తసులభుడినని!?

**మధుర:** మీకు అన్నీవున్నాయి, మీరు అన్నీ పొందారు; అనుభవించారు. మీకు లోటులేదు. తృప్తిగా ఉన్నారనుకుంటా.

**సివారె:** నేను ఎలా ఉన్నానో నాకు తెలుసు; నా అంతరాత్మకు తెలుసు. సుఖంలో సుఖంలేదు.

**మధుర:** మీరు (మీ) జీవిత చరిత్ర ఎందుకు రాయలేదు?

**సివారె:** జాగ్రత్తగా చూస్తే నా కవిత్వం నిండా నేను పరుచుకొని వున్నాను. మళ్లీ రాయటం దేనికి?

**మధుర:** మీరు వచన రచనలు చెయ్యలేదేం?...పైగా ఇది వచన రచనాయుగం కూడాను.

**సివారె:** నేను వచన కవిత్వం బోల్డు చెప్పా.

**మధుర:** నే నడిగే దొకటీ మీరు చెప్పేదొకటీని. కాలికేస్తే మెడకీ, మెడకేస్తే కాలికీ వెయ్యడం మీకు సరదావా?

**సినారె:** నీకు కోపం వచ్చినట్లుంది.. అయినా అదీ వోసొగసే-

**మధుర:** మీ సినిమాపాటలు నాకిష్టం. అది సరేగాని; పాట-అనేది ఎవరేనా రాయమని అడిగినప్పుడు రాయడం కష్టమూ యాంత్రికమూ అయిపోదండీ; నాకు తెలీకడుగుతానూ?

**సినారె:** దానికీ కొంత ఘర్షణ వుంటుందనుకో, అయితే, అది లోపల! నిరంతరం కవితోపాసన చేసేవారికి సినిమాపాట రాయడమనేది కవిత్వం మేడీజీ యే తప్ప కుప్పుస్వామయర్ మేడ్ డిఫికల్ట్ కాదు. గిరీశం గారు సినిమాఫీల్డు లో కొస్తే మంచి సినిమారైట రయ్యుండేవాడు.

**మధుర:** మీరు ఫీల్డులోకి రావడం సినిమాప్రపంచంలోకి సరస్వతీ రంగప్రవేశం.

**సినారె:** నీ కామెంటులో కొంత నిజం వుంది నేను సాహితీపరుణ్ణి కాబట్టి సాహితీ ప్రపంచం అక్కడ కూడా నాతో ఉంటుంది; వాగర్థావివ సంపృక్తౌ అన్నట్లు

**మధుర:** మీ వ్యక్తిత్వం లో కొంతస్త్రీత్వం కనిపిస్తూ వుంటుంది, గమ్మత్తుగా!

**సినారె:** ప్రతికవీ అర్థనారీశ్వరుడనుకాని, అర్థనారి, అర్థ ఈశ్వరుడూ మనిషిలో ఉండకుండా ఎలా?

**మధుర:** మీరు రాసిన సినిమాపాట ఏదైనా రేడియోలో వస్తున్నప్పుడు మీ కేమని పిస్తుంది?

**సినారె:** ఆ సన్నివేశం గుర్తుకొస్తుంది

**మధుర:** అప్పట్లో సన్నివేశాలకీ పాత్రల మనస్తత్వాలకీ అన్వయించేటట్లుగా పాటలు రాయమని అడిగేవాళ్లు గాబోలు, ప్రొడ్యూసర్లో డైరెక్టర్లో

**సినారె:** అవును అవన్నీ కవితా రూపంలో వ్యక్తమయ్యే పరస్పరాభిప్రాయాలు అంటే- ఒక డ్యూ ఎట్ వుందనుకో; అందులో పల్లవి అలావదిలేస్తే స్త్రీపాత్ర చరణాలూ పురుషపాత్ర చరణాలూ వుంటాయి కదా అవికూడా డైలాగులే, ఎటొచ్చీ కవితాత్మకంగా'. వాటిని అన్నవాళ్లకీ విన్నవాళ్లకీ ఆహ్లాదకరంగా రూపొందేవి ఫలానా సందర్భం, ఫలానా సన్నివేశం అని కవికి వివరంగా చెప్పేవారు ట్యూను సుమారుగా యిదీ అని వినిపించేవారు.

**మధుర:** అర్జంటుగా రాసిచ్చేమనేవారా?

**సినారె:** అర్జంటుగా రాసిచ్చేమనే వాళ్లూ ఉండేవారు, అర్జంటుగా రాయగలిగేవారూ ఉండేవారు టేక్‌యువర్ ఓన్‌టైమ్ అనేవాళ్లూ ఉండేవారు, నెలల తరబడి టైమ్‌తీసుకునేవారూ ఉండేవారు

**మధుర:** మీలాగా, ఆత్రేయ గార్లాగానా? మీరు శుక్రవారం ఫ్లయిట్‌లో మద్రాసు వెళ్లి శనాదివారాలు అక్కడుండి నాలుగో ఐదోపాటలు రాసేసి ఆదివారంఫ్లయిట్‌లో హైద్రాబాదొచ్చేసి సోంవారం క్లాసులు చెప్పేవారట. అర్జంటుగా రాసినా చాలా బాగారాసేవారు మీరు మీ రెగ్యులర్ కవిత్వంలాగే మీ సినిమాపాటలు కూడా విశ్లేషణకి అనువైనవి.

**సినారె:** అవును, పాత సినిమాల్లో ఏసందర్భానికి ఏ పాట ఎట్లావ్రాశారు; ఏపాటలో ఏభావం ఎంత కవితాత్మకంగా వచ్చింది అనేవిషయాల్ని ఉదహరిస్తూ కొన్నాళ్లకిందట భరాగో కొన్నివ్యాసాలు రాసేరు అతనోసారి నాద్వారా ఒక ఎవార్డు అందుకున్నప్పుడు తారసపడ్డాడు. ముప్పయి వ్యాసాల వరకూ వ్రాసినా ఇంకామీకు సినారె, దాశరథి, ఆరుద్ర తగల్లేదా అని అడిగా

**మధుర:** మీరూ దాశరథీ ఆరుద్రా ప్రవేశించాక సినిమాపాటలో కవిత్వపు విలువలు అలా ఉంటూనే చాదస్తం పోయిగడుసుతనమూ ఆధునికతాక్లుప్తతా వొచ్చేయని భరాగో వ్రాశాడు. ఆవ్యాసాలు ఇప్పటి రీడర్సు కొందరికి ఎక్కడంలేదని ఆ ఎడిటర్గారు వాట్ని ఆపించేశార్ట మా పురాణంగారు మరికొన్ని రాయించారుగాని ఆ పత్రికే ఆగిపోయింది కానీ, అది అలా కంటిన్యూ అయ్యుంటే మాత్రం మీ పాటలున్న సినిమాల్ని గురించి కనీసం పది వ్యాసాలైనా వచ్చుండేవి.

**సినారె:** ఒక కవి రాసిన సినిమా పాటల్ని పుస్తకంగా తీసుకురావడం అనేదుంది. ఆరుద్రవి, శ్రీశ్రీవి, నావి- ఇలా కొన్ని వచ్చాయి కాని, సినిమాపాటలకి విద్వద్విశ్లేషణ అనేది మరికొంచెం శాశ్వతమైన గౌరవం. పైడిపాల థీసిస్లో ఆపని కొంత జరిగింది

**మధుర:** అలా విశ్లేషిస్తే మీ కవిత్వం గురించి ఎన్ని పుస్తకాలు రావాలో!

**సినారె:** అంతే!

**మధుర:** కర్పూర వసంతరాయలు నుంచి సాగిన మీ కవితాయానంలో ఎన్ని భౌగోళిక, భౌతిక, తాత్త్విక, ప్రాపంచిక, ఔత్సాహిక మజిలీలు, ఎన్ని వైవిధ్యాలు! ఈమధ్యటూ- ఇన్-వన్ లూ త్రీ- ఇన్-వన్ లూ అని వస్తున్నాయి కదా మీరు మెనీ- ఇన్-వన్ అంటాను

**సినారె:** ఇంగ్లీషులో ''జాక్ ఆఫ్ ఆల్ ట్రేడ్స్'' అని వొకటుంది. అదికాబోలు, నీ వెక్కిరింపు. అను; అను!....కానీ, ''పడ్డ వారికి చేటు వాటిల్లదెపుడు!''

**మధుర:** బహుముఖ ప్రజ్ఞాశాలీ, శీలీ, శూలీ-కూడా కదా మీరు! ఎట్నుంచి నరుక్కొచ్చినా కవిత్వమే కారుతుంది

**సినారె:** ఎక్కడైనా ఒకచోట వెలితి అనేదుంటే దాన్ని యితర శక్తులు భర్తీచేస్తాయి కాలాన్ని జయించాలని సినారె కావ్యానికి దాహం

**మధుర:** గజల్ అన్నారే-అదేమిటది?

**సినారె:** ప్రియురాలితో సల్లాపం ఇంకా చాలా మీనింగులున్నాయి ప్రాయికంగా యిది శృంగార పరం

**మధుర:** మీరు ఏపాకిస్తాన్కో రాయబారిగా వెళ్తే ఈ ఉర్దూ పర్షియన్ సంప్రదాయ కవితలు మరింత ప్రఖ్యాతిని పడేవి అలాకాక ఏస్విజర్లాండుకో ఎంబాసిడర్గా వెళ్లుంటే మన దేశానికి సాహిత్యంలో మరో నొబెల్ప్రైయిజు తెచ్చేసుండేవారు.

**సినారె:** అవన్నీ ఆలోచించవలసిందీ తేల్చవలసిందీ నువ్వూనేనూ కాదు.

**మధుర:** మీ రెక్కడానికి ఈ దేశంలో ఇంకే కుర్చీలూ లేవు; అందుకని అంటున్నాను.

**సినారె:** బాగుంది నీ వేళాకోళం!

**మధుర:** 'ఏవమ్మా, తెలుగమ్మా; ఎక్కడ నీ చిరునామా?' అన్నారుగా, మీరు!

**సినారె:** వచ్చినాడు, వచ్చాడు, వచ్చిండు- ఏదైతేనేం? పరిపాలనలో తెలుగుపెరగాలి నిండుగా.

**మధుర:** మీకు విగ్రహారాధన అంటే మక్కువ లేదటగా

**సినారె:** నేను ఎవర్నీ ఆరాధించను. ఆరాధనాతత్వం లేదు, నాలో, నిజంగా.

**మధుర:** మీ బొమ్మ ఒకటి మీ ప్రతీ పుస్తకం మీదా ఉంటుంది. ఎందుకు, అలా వెయ్యడం?

**సినారె:** ఓ, అదా? నా అభిమానులు నా పొయిట్రీనీ నా ఆకారాన్నీ కూడా ఆరాధిస్తారు.

**మధుర:** మీకు మీ బొమ్మంటే పరమ ప్రీతి అది ఒరకంగా ఆత్మస్తుతీ నార్సిసిజమ్.

**సినారె:** ఎవరి అందాన్ని వారు ప్రేమించుకోవటం స్త్రీలకు మాత్రమే జన్మహక్కా?

**మధుర:** చిన్నప్పుడు హరికథలు మిమ్మల్ని బాగా ఉత్తేజపరిచాయనుకుంటాను...

**సినారె:** అవిమనకి వాకీ టాకీ యూనివర్సిటీలు హరికథలూ పురాణాలూ భాగోతాలే మన్ని ఎడ్యుకేట్ చేసేయి

**మధుర:** మీ యాభై సంవత్సరాల పండగ చేసుకున్నప్పుడు మీరన్నది నాకు జ్ఞాపకం వుంది!

అమ్మగ సింగిరెడ్డి బు
చ్చమ్మగ కమ్మగ నను
పెంచిన మా హనుమాజీ
పేటకు ఈ సన్మానం!

**సినారె:** నేను పాలేర్లతో బాటుగా నేల దున్ని పనిచేశా

**మధుర:** మీ 'పశులపోని' కవిత మిమ్మల్నీ మీ కవితల్నీ వెలుగులో ముంచింది. మీ Roots ఎక్కడున్నాయో చెప్పింది

**సినారె:** ప్రతి చెట్టుకీ వేళ్లుంటాయి, మూలాలుంటాయి. కొందరు చెప్పుకుంటారు; కొందరు కప్పెట్టుకుంటారు

**మధుర:** అంబలిలో చింతతొక్కునంచుగుని జుర్రాలని నాకూ అనిపిస్తుంది. అర్బనైజేషన్నించి అంబలీ తోపా మర్చిపోయేం. 'సన్నజాజీ పూలమాలా' మంచి ఎలిజీ. మీరు అలవోకగా రాసిన 'తెలుగు వాడు' ఎన్నిసార్లు చదువుకున్నా సరే; ఆ చెప్పిన సంగతులకి ఒళ్లు పులకరిస్తుంది. మాగాయి టెంక పెరుగులో ముంచుకున్నట్టుంటుంది ఆ కవిత. సంవత్స రానికో కావులాగా కావ్యాలపంటలొస్తే కవిత్వం ఎక్కువ రాశారనుకుంటారు

**సినారె:** నాకు అలా కనిపిస్తుందీ, అనిపిస్తుందీ. రాయగలను గాబట్టి రాస్తాను. కవిత్వం కొంచెమేరాయాలి. ఎక్కువ రాయకూడదూ అని రూ లేదైనావుందా?

**మధుర:** విశ్వనాథ సత్యనారాయణగారు నవలలు, కథలు, విమర్శలు, కవితలు; రామాయణ కల్పవృక్షంతో సహా ఎన్ని ఉదయింపజేశారో! ఫారిన్‌లో అయితే ఆ పుస్తకాల మీద వచ్చే రాయల్టీలతో మూడు తరాల వాళ్లు సునాయాసంగా కాలుమీద కాలేసుకొని బతికే గలరు

**సినారె:** నేను ఆధునిక వచన కవిత్వం ఎక్కువ రాశా. అన్నీటచ్ చేశాననుకో.

**మధుర:** మీరు నవలలూ కథలూ రాయకపోయినా కర్పూర వసంత రాయలు రాశారుగా. సమష్‌చేస్తే మీరు దారితప్పిన గంధర్వుడు లాంటివారు

**సినారె:** మధురవాణి పొగడ్త రెండు వైపులా పదును ఎత్తేస్తావో కిందపడేస్తావో తెలీదు

**మధుర:** మీరు నేలతల్లి ముద్దుల బిడ్డ. కిందపడ్డా లేచినిలబడి జండా యెగరెయ్యగల్రు అవునూ, మీ కవిత్వాలు పరిశీలిస్తే మీరు కాస్సేపు తీవ్రవాదం వేపు, కాసేపు గవర్నమెంటు పక్షం, కొంత ఎన్.టి. ఆర్ సైడింగు యిలా అన్ని వుద్యమాల దిక్కులకీ పొద్దు తిరుగుడుపువ్వులా మొహం తిప్పుతూ వుంటారనిపిస్తుంది మీరు దేనికి కట్టుబడి వుంటారో అంతా అయోమయం

**సినారె:** ఎవరయినా మనసు చెప్పినట్లు వ్యవహరిస్తారు కదా! మనసొకచోట, మనిషొకచోటగా ప్రవర్తించటం సబబుకాదు మనసు గుఱ్ఱము రోరి మనిసీ-అన్నారు విశ్వనాధ

**మధుర:** మానస వనచర వర సంచారము-అని త్యాగరాజు అంటే మనస్సు గుఱ్ఱం కాదు, కోతి అని పోనీలేండి, కోతో, గోడమీద పిల్లో-గవర్నమెంటుకీ పాలకవ్యవస్థకీ కమిట్ అయిరాసే వాళ్లు భజంత్రీలూ భట్రాజులూ తప్ప వైతాళికులు కాలేరంటారు, అందుకని అడిగాను

**సినారె:** నేను వైతాళికుణ్ణి అవునో కాదో నాకు తెలీదు గాని భజంత్రీనీ భట్రాజునీ మాత్రంకాదు ఇతరులు అనుకునే దాన్ని మనం ఎలా సమర్థిస్తాం, ఎలావ్యతిరేకిస్తాం?

**మధుర:** మీ ఆవేశానిది ఒకదారీ, మీ వ్యక్తిత్వానిది మరొకదారీ లా కనిపిస్తోంది

**సినారె:** దానికీ నేనిప్పుడు చెప్పిందే జవాబు

**మధుర:** ఆకృతికీ ఆశ్రుతికీ ప్రతీక సరస్వతి అన్నారుగా, మరి?

**సినారె:** అలా కూడా నా దారికే వచ్చావు, చూసుకో.. నాహృదయం ఒకకెలిడోస్కోపు నాకలం ఒక జీవనది నా కళ్లు ఎక్స్‌రే కంటే లోతుగా చూస్తాయి నేను ధార్మనికుణ్ణి

**మధుర:** జయదేవుడు అష్టపదులు రాస్తే మీరు పంచపదులు ఏవో రాశార్ట.

**సినారె:** పంచ పదులు కావవి, 'ప్రపంచ-పదులు'. శబ్ద-లయ-భావ-స్పందనలు గల ఒక విలక్షణమైన వ్యక్తీకరణం. ప్రపంచించి-అంటే విస్తరించి చెప్పడం. ఇవి విశేషమైనవి. లోక తత్త్వాన్ని వివరించి విశ్లేషించేవి

**మధుర:** వేమన పద్యాల్లా

**సినారె:** నాదృష్టిలో రుబాయీ వుంది దానికి ఐదో పంక్తిని జోడించా.
ఎన్నిమెట్లు ఎక్కావని కాదు, ఎంత ఎత్తుకెదిగావనీ;
ఎన్నిమునకలేశావని కాదు, ఎంతలోతు చూశావనీ;
గమనం సార్థక మౌతుంది నీ గమ్యాన్నిచేరినప్పుడే
ఎన్ని సభలు తిరిగావనికాదు, ఎంతబుద్ధి పెంచావనీ
ఎన్ని కృతులు చదివావనికాదు, ఎంతసిద్ధిపొందావని!

**మధుర:** బురదలోన వుంటున్నా తరగదు పద్మం విలువ
తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ
అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు?
అరసికులేమంటున్నా చెరగదు గానం విలువ
మూర్ఖులు ముంచేస్తున్నామునగదు జ్ఞానం విలువ!

★ ★ ★

ఏది చూసినా లోతును ఇట్టే పసికట్టాలి
ఏదిగీసినా కంటిని ఇట్టేచెరపట్టాలి
ఏదోఫరవాలేదని ఎందుకు ఆ గిట్టింపు
ఏది రాసినా గుండెను ఇట్టే గిలకొట్టాలి
ఏదిచేసినా లోకం ఇట్టే జే కొట్టాలి!

నేనూ గిరీశం గారూ మీప్రపంచపదులు చదివి అబ్బో అనుకున్నాం, ఓ రబ్బోఅనుకున్నాం.

**సినారె:** అంటే, నా ప్రపంచపదులు గిరీశాలూ వెంకటేశాలూ చదువుతారని దెప్పి, వెక్కిరింపా?

**మధుర:** మీరు మాటల కోటీశ్వరుడు నడుమ బట్టగట్ట నగుబాటు నాదొకో అన్నాడు వేమన మీకూ వేమనకూ అదే, తేడా

**సినారె:** నీ పోలికలూ మెలికలూ చాలించు, నేను పదచిత్రణమాత్ర జీవిని.

**మధుర:** 'అమ్మబొమ్మ' అనిరాసిన అమ్మజ్ఞాపకాలు అమ్మంత కమ్మగా బావున్నాయి. గురజాడ ముత్యాల సరం కనిపెడితే మీరు ప్రపంచపదులు విస్తరించేరు మీరు పూర్తిగా గురజాడ మార్గాన్నే ఫాలో అయ్యారా?

**సినారె:** నాది గురుజాడ అడుగుజాడే అయితే మేమంతా సంప్రదాయ కవిత్వం, భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం-యీ ధోరణుల్లోంచి నడిచి వచ్చాం మామీద అనేక గాలులు వీచాయి. పాతేసిన నమ్మకాల స్థంబాల్లాకాక, మార్పును పేర్చుకునే హరిత మూర్తుల్లా జీవించినప్పుడే మనం మనుషుల మనిపించుకుంటాం

**మధుర:** 'అప్పటికతడు మంచివాడే' అనే కవితలో ఓ కథ చెప్పారు. అది నిజంగా ఓ నవలకు సరిపోతుంది దాంటో ప్రపంచపు బాధంతా పలికించేరు. 'సూర్యప్రభమ్మతి

లేనిది, సహజప్రభ మృతిలేనిది' - అని అన్నారు 'శం చావదు; మట్టై బతుకుతంది!' అన్న ఆశావాది, మీరు. అయితే, కవిత్వం తోనూ రాసిన దాంతోనూ తృప్తి పడిపూరుకోడం సవ్యం కాదనుకుంటాను

**సినారె:** నీ ఉద్దేశం నేను తుపాకీ పట్టుకుని ఏ అడవుల్లోకో వెళ్లుండవలిసిందనా?

**మధుర:** వ్యవస్థపై ఆగ్రహం అక్షరాల్లో మాత్రం ప్రదర్శిస్తే చాలదు సర్పంబు పడగనీడను కప్పవసించిన విధంబుగదరాసుమతీ అవుతుంది.

**సినారె:** మన మంతా అలాగే జీవిస్తున్నాం నేను ధర్మామీటర్నేగాని జ్వరం తగ్గించే మాత్రను కాను

**మధుర:** మీ శైలిని చూసి కంగారు పడి మీరు "అధర్మా' మీటర్ మోనని భయపడ్డాం మీరు ఉత్తరకుమారులు కారు, అర్జునులే కాని, గాండీవం యింకా ఎక్కుపెట్టలేదు

**సినారె:** దూసుకుపోయే యుగ ప్రగతి ఆగిపోరాదు అలసిపోయినారక్తం రంగు వెలిసిపోరాదు

**మధుర:** 'కీర్తి జలతారు పూతతో నావ ర్తి మారిందా?' అని మీరే డవుటులో పడ్డారొకప్పుడు 'నా వెన్నంటి నడిచే నీడలారా, నన్నువిడిచి వెళ్లకండి' అన్నారు కదా! సూర్యుడు తోడుంటాడు; మీ దోషాలను మాడుస్తూ, మీనీడలను నడిపిస్తూ.

**సినారె:** అవును పచ్చని మొక్కల్లాంటి మనుష్యుల మధ్య మంచెలా తలెత్తుకు నిలుస్తాను

★

